క్లుప్తంగా

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు పంపిణీ చేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో బుధవారం లక్కీడిప్ నిర్వహించి ప్రయాణికులకు బహుమతులు పంపిణీ చేసినట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. రాయచోటి, ముళబాగిల్, దొడ్డిపల్లె, తిరుపతి, మేటిమంద, కలికిరి మార్గాల్లో వెళ్లే ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణికుల నుంచి టిక్కెట్లను గిఫ్ట్‌బాక్స్‌లో సేకరించి లక్కీడిప్ నిర్వహిస్తుండటం విదితమే. లక్కీడిప్‌లో విజేతలుగా నిలిచిన వెంకట్రమణ, జమ్రూత్ జాన్, లోకేష్, మల్లికార్జున, బావాజాన్, బాషా, పునీత్, సంజనారెడ్డిలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, మెకానికల్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

పలమనేరు: పట్టణంలోని ఆరు సెంటర్లలో టెన్త్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సోషియల్ పరీక్షకు 1345మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1319మంది హాజరయ్యారని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం తెలిపారు.

హుండీ ఆదాయం రూ.37 వేలు



చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. 77 రోజులకు గాను మొత్తం రూ.37,610 లభించిందని ఈఓ కమలాకర్ తెలిపారు. ఈ సొమ్మును ఆలయ ఖాతాకు జమ చేయనున్నట్లు చెప్పారు.

అపరాధం లేకుండా పన్నులు చెల్లించండి

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలకు ప్రభుత్వం అపరాధ రుసుం రద్దు చేసిందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సెలవు రోజుల్లోనూ పన్నులు కట్టే వెసులుబాటు కల్పించినట్టు తెలియజేశారు.

పార్టీల జెండాలు మాత్రమే తొలగించాలి

పలమనేరు: పట్టణంలో రాజకీయ పార్టీల జెండాలను తొలగించమని ఆదేశించామని, అయితే మున్సిపల్ సిబ్బంది శ్రీరాముని జెండాలను తొలగించడం సరికాదని, వాటి జోలికి వెళ్లరాదని ఆదేశించినట్టు పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శ్రీరాముని జెండాలను తొలగించడంపై పలువురు స్థానికులు బుధవారం ఫిర్యాదు చేయడంతో ఆర్డీఓపై విధంగా స్పందించారు. దీంతో వివాదానికి తెరపడింది.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



చల్లావారిపల్లెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కల్లూరు సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం రాత్రి చల్లావారిపల్లెలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు మోటార్ సైకిళ్లు ఇవ్వరాదని, చేజేతులా వారు ప్రమాదాల బారిన పడటానికి కారకులవుతారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.14.79 లక్షలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హుండీ కానుకల ద్వారా రూ.14,79,624 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. బుధవారం అర్ధగిరి క్షేత్రంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. గత ఏడాది 2023 డిసెంబర్ 12 నుంచి 2024 మార్చి 27వ తేదీ వరకు హుండీ ద్వారా వచ్చిన కానుకలను లెక్కించినట్లు చెప్పారు. అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారి సాయిసులోచన రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ వస్తే..రోడ్లన్నీ ఖాళీగా ఉండాలట!

- అక్కసు వెళ్లగక్కిన చంద్రబాబు
- సీఎం లక్ష్యంగా 'ప్రజాగళం'లో విమర్శలు
- స్పందించని ప్రజలు
- ఎప్పటిలాగే హామీల మోత



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న చంద్రబాబు



చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం ధాటికి వెనుదిరుగుతున్న ప్రజలు

పలమనేరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ 'సిద్ధం' సభలకు లభించిన విశేష స్పందన, సభలకు హాజరైన అశేష జనవాహినిని పత్రికలు, టీవీలలో చూసిన చంద్రబాబు భయపడ్డారా? ఆయనలో ఆందోళన మొదలైందా? మేకపోతు గాంభీర్యంతో మాట్లాడుతున్నారా? అంటే..పలమనేరులో బుధవారం నిర్వహించిన 'ప్రజాగళం'లో ఆయన తన గళం విప్పిన తీరు చూసిన ప్రజల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీని విమర్శించడానికే తన ప్రసంగంలో ఎక్కువ సమయం కేటాయించారు. చంద్రబాబు మాట్లాడుతూ, జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి ఇక్కడికొస్తే జనాలు రాకుండా రోడ్లు, వీధులన్నీ ఖాళీగా కనిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాను అసలు నమ్మరాదని, అందులో వచ్చేవన్నీ అబద్ధాలేనని ఆడిపోసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారం పక్షం గెలుపు కోసం ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా చలించరాదని, పెద్దమొత్తంలో నగదు ఇచ్చినా ఓటర్లు తీసుకోరాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో పలమనేరు నాశనం అయిందని, తాము అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తామన్నారు. అంతేకాకుండా తమ హయాంలో మంజూరైన వాటిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ మళ్లీ మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇక, పలమనేరు నుంచి ప్రజలు ఇంత ఫాస్ట్‌గా బెంగళూరుకు వెళుతున్నారంటే ఆ హైవే వేసింది తామేనని గొప్పలు చెప్పుకున్నారు. గతంలో పలమనేరులో మిస్బా అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని, అదే టీడీపీ అధికారంలో ఉంటే ఆ ఘటన జరిగేది కాదని, అంతేకాకుండా కౌండిన్య అడవిలో దశాబ్దాలుగా ఉన్న ఏనుగుల సమస్యకు పరిష్కారం తమకే తెలుసని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల వారు పలమనేరుకు వచ్చి ఉద్యోగాలు చేసేలా ఇక్కడ పరిశ్రమలు స్థాపించి ఉపాధిని చూపుతామని, స్థానికంగా టమాట, మామిడి మార్కెట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని రకాల వ్యాధులకు ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథ్‌రెడ్డి విరుగుడు మందులా పనిచేస్తారంటూ ఆయన్నో డాక్టర్ లెవెల్లో హైప్ ఇచ్చే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థితోపాటు ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎక్కడికెళ్లినా ఒకటే స్పీచ్

కుప్పంలోనే కాదు పలమనేరులోనూ చంద్రబాబు చెప్పిందే చెప్పి రొటీన్ ప్రసంగంతో ప్రజలకు బోర్ కొట్టించారు. తన గంట ప్రసంగంలో అనువుగాని హామీలు వందల్లోనే గుప్పించారు. ఈ మాటలు విన్నీ వినీ జనం అక్కడనుంచి మెల్లగా జారుకోవడం కనిపించింది. ఆయన పదేపదే చేతులెత్తండి..గట్టిగా చప్పట్లు కొట్టండి.. అంటున్నా జనం నుంచి పెద్దగా స్పందన రాలేదు. దీంతో ఎండను సైతం లెక్క చేయని మీ స్ఫూర్తిని మెచ్చుకుంటున్నానంటూ జనాన్ని నైస్ చేశారు.

విమర్శించబోయి పొగడ్త!

తన ప్రసంగంలో చంద్రబాబు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో అవినీతి ఆగిపోయిందని చెప్పడంతో జనం ఆశ్చర్యచకితులయ్యారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను చూసి ఇవంతా జరిగేపనేనా? అని విస్తుపోయారు. ఏనుగుల సమస్య, ఇక్కడి ప్రాజెక్టులు, రోడ్లు ఇవన్నీ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదని ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

చెప్పింది చేయడమే జగనన్న లక్ష్యం



కుమ్మరనత్తంలో పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్

- 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- ఇంటింటా ఎన్నికల ప్రచారం

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేశారని, చెప్పింది చేయడమే ఆయన లక్ష్యమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలసి జెడ్పీ చైర్మన్ ×మేము సిద్ధం..మా బూత్ సిద్ధం× కార్యక్రమాన్ని మండలంలోని బండ్లపల్లె, నెక్కుంది, ఏతూరు, గుడిసెబండ, కుమ్మరనత్తం బూత్ పరిధిలో నిర్వహించారు. పోస్టర్లను విడుదల చేశారు. ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందజేసిందని, ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను మోసగించేందుకు వస్తున్న ఉమ్మడి పార్టీలు 2014లో చేసిన మోసాలను గుర్తు చేసుకుని తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



ప్రచారం చేస్తున్న చైర్మన్ సుధీర్

కుప్పం: రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్సార్ సీపీని ఆదరించి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కోరారు. బుధవారం మున్సిపాలిటీలో 18, 20వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వల్ల ప్రతి కుటుంబానికి కలిగిన మేలు గురించి ఆలోచించాలని తమ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పట్టణంలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేసేవారని, మున్సిపాలిటీ అయిన తరువాత పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చేసినట్లు చెప్పారు. పట్టణంలో తమ ప్రభుత్వం పాలనలో చేసిన అభివృద్ధి దృష్టిలో ఉంచుకుని రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ సొసైటీ చైర్మన్ అబ్బాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



పుంగనూరులో ప్రచారం చేస్తున్న కృష్ణమూర్తి, నాగభూషణం, అలీమ్‌బాషా



రొంపిచెర్ల: చిచ్చిలివారిపల్లెలో ఎంపీపీ ప్రచారం



రొంపిచెర్లలో ప్రచారం చేస్తున్న ఇబ్రహీంఖాన్



ఎస్ఎస్ పేటలో ప్రచారం చేస్తున్న ఫకృద్దీన్ షరీఫ్



సుబేదారువీధిలో ప్రచారం చేస్తున్న జయరాం



రొంపిచెర్ల: గానుగచింత గొల్లపల్లెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పార్టీ నాయకులు

పుంగనూరు: 30 ఏళ్లుగా ఒకే కుటుంబం చేతిలో నిర్లక్ష్యానికి గురైన పుంగనూరు నియోజకర్గంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల కాలంలోనే ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో కలిసి కృష్ణమూర్తి, రాష్ట్ర జానపద కళల సంస్థ అధ్యక్షుడు కొండవీటి నాగభూషణం తదితరులు పట్టణంలోని తూర్పు మొగశాల, చింతలవీధి, బజారువీధి, కట్టక్రిందపాళ్యెం ప్రాంతాలలో ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ఎస్ఎస్ పేటలో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, కౌన్సిలర్లు భారతి, రాఘవేంద్ర, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాన్, సుబేదారువీధిలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జయరాం , కౌన్సిలర్ కిజర్‌ఖాన్ ఇంటింటా ప్రచారం చేశారు. కౌన్సిలర్లు పూలత్యాగరాజు, కొండవీటి నటరాజ, కాళిదాసు, జేపీ యాదవ్, మనోహర్, రేష్మా, సుప్రియ, ఆదిలక్ష్మి, నరసింహులు, పద్మావతమ్మ, కృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, బోయకొండ డైరెక్టర్ రాజేష్, సచివాలయాల కన్వీనర్ వరదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, కిషోర్, సోము, రమణ, ప్రభు, సలామత్ , మైనార్టీ నాయకురాలు సల్మా పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎన్నికలలో ప్రజలు గెలిపించాలని కోరుతూ బుధవారం మండలంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు జోరుగా ప్రచారం చేశారు. చిచ్చిలివారిపల్లెలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, మోటుమల్లెలలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, రొంపిచెర్లలో పార్టీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్ ఇంటింటా ప్రచారం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గానుగచింత గొల్లపల్లెమ్మ ఆలయంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ప్రచారంలో మాజీ జెడ్పీటీసీ నీలుఫర్, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, ఎంపీటీసీలు రమణమ్మ, సిరాజున్నీసా, సర్పంచులు నాగిరెడ్డి, ప్రసాద్‌నాయుడు, జీవలత, నాయకులు సురేంద్రనాయుడు, బాబు, ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, అలీంఖాన్, సూర్యనారాయణ రెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం..!



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట నుంచి కావేటిగారిపల్లె పంచాయతీ వరకు అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు దాదాపు 1000 మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి రావాలని, అలాగే పుంగనూరు శాసన సభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా, ఆనంద, రాయల్‌మోహన్, చంద్రశేఖరరెడ్డి, రాఘవరెడ్డి, రాజశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, రాజమూర్తి, వాసుదేవరెడ్డి, రవీంద్రనాదరెడ్డి, మునస్వామి, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

కుప్పం భవిష్యత్తు కోసం ఆశీర్వదించండి



శాంతిపురం: కరేగానూరులో కరపత్ర ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్, నాయకులు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

శాంతిపురం: గత ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి జరిగిన మంచిని మించి భవిష్యత్తులో మరింత మేలు పొందేందుకు వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ కోరారు. బుధవారం రాత్రి గుంజార్లపల్లె పంచాయతీలోని కరేగానూరు, పెద్దబొమ్మనపల్లెలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రజలతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వివిధ పథకాల రూపేణా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అయ్యిందన్నారు. దీనితో రాష్ట్రంలో పేదరికం తగ్గిందని చెప్పారు. మళ్లీ అబద్ధాలు, తప్పుడు హామీలతో వచ్చే వారి మాటలకు మోసపోవద్దని కోరారు. జగనన్న ఏ మాట చెప్పినా దానికి కట్టుబడి ఉంటారన్నారు. రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై ముద్రించి తనను ఎమ్మెల్యేగా, రెడ్డెప్పను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, నాయకులు ఏవీ జయరాం, సోమారెడ్డి, వినోద్‌కుమార్, హేమంత్‌రెడ్డి, చిన్నప్ప, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబు మాటలు నమ్మొద్దు

రామకుప్పం: మండలంలోని కెంచనబళ్ల పంచాయతీ గాంధీనగరంలో బుధవారం ఎమ్మెల్సీ భరత్ స్థానిక నేతలు, కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు చెప్పిన అబద్ధపు హామీలను ప్రజలు నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. 35 సంవత్సరాలు ఎమ్మెల్యేగా,14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుప్పంను అభివృద్ధి చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాబు ఎన్నికల సమయంలో చెప్పే ప్రతి మాట అవాస్తవమన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్న తనను ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని భరత్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భరత్‌కు ఘనస్వాగతం పలికారు.

భర్త గెలుపు కోసం భార్య ప్రచారం



కోటపల్లెలో ప్రచారం చేస్తున్న దుర్గ

గుడుపల్లె: గ్రామాలలో పేదల కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పథకాలతో వెలుగులు నింపారని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అన్నారు. బుధవారం మండలంలోని కోటపల్లెలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్తను, అలాగే ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ప్రభుత్వంలో పేదలను నాయకులు పట్టించుకున్న పాపానపోలేదని, పథకాల ఫలాలన్నీ అప్పనంగా ఆరగించారని విమర్శించారు. జగనన్న పాలనలో నేరుగా అర్హుల ఇళ్లకే పథకాలు చేరాయన్నారు. భరత్ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉన్నారని, మీ ఇంటి బిడ్డగా భావించి భరత్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని, రానున్న ఎన్నికలలో రెండు ఓట్లు ఫ్యాన్‌కు వేయాలని కోరారు.

మేము సైతం..జగనన్న సైన్యం



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



పెద్దపంజాణి: రాజీనామా పత్రాలను వెల్ఫేర్ అసిస్టెంటుకు అందజేస్తున్న వలంటీర్లు

- వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యం
- ఉద్యోగాలకు రాజీనామా చేసి స్పష్టం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

వి.కోట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నా, వైఎస్సార్ సీపీ అన్నా గుండెల నిండా అభిమానం నింపుకున్న కొందరు వలంటీర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించి, ఎన్నికల ప్రచారం చేస్తుండటం మొదలైంది. ఇప్పుడా ప్రభావం వీ.కోట మండలంపై కూడా పడింది. బుధవారం మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు దివాకర్, కీర్తి, మణికుమార్, వెంకటేష్ తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఆ లేఖలను ఎంపీడీఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ, ఎన్నికల విధులకు హాజరు కారాదనే నిబంధనలు పెట్టారని, దీంతో తాము రాజీనామా చేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావాలన్నదే తమ అభిమతమని, తామంతా ఎమ్మెల్యే వెంకటేగౌడ, సీఎం జన్‌మోహన్‌రెడ్డిని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవడానికి కృషి చేస్తామన్నారు.

వలంటీర్ల సామూహిక రాజీనామా

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న 17మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను అందుబాటులో ఉన్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు అందజేసి వారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు ప్రచారాలు నిర్వహించకూడదని, మంచి చేసిన ప్రభుత్వానికి తాము వెన్నంటే ఉండాలనే ఉద్దేశంతో వలంటీర్ పోస్టులకు రాజీనామా చేసినట్లు చెప్పారు. ఇక, వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేస్తామని ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో శ్రీనివాసులు రెడ్డి, ప్రవీణ, హంసవేణి, నాగరాజు, తేజశ్రీ, వేదవతి, అనూష, యారబ్, రజీవుల్లా, మన్సూర్, షహీంషా, సాదిక్, ఖాజా, పావని, రమణప్ప, పుష్పలత, వినోద్‌కుమార్ ఉన్నారు. జగనన్నకు అండగా నిలిచిన వలంటీర్లను గ్రామస్తులు అభినందించారు.

రొంపిచెర్లలో ఇద్దరు..

రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు. కెఎన్. దళితవాడకు చెందిన వలంటీర్ శశికుమార్, దద్దాలవారిపల్లెకు చెందిన శివప్రసాద్ తమ రాజీనామా లేఖలను గురువారం ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారికి అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తాము రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలకు నిర్వహణకు సంబంధించి 48 గంటల ముందే ఆర్వో నుంచి అనుమతి పొందాలని జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి. శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఏఆర్‌ఓ అరుణ, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డితో కలసి చిత్తూరు నియోజక వర్గంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమించిన నోడల్ ఆఫీసర్లతో ఆయన సమీక్షించారు. నిబంధనలను ప్రకారమే రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.వీఎస్టి, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టి టీమ్స్ ఇచ్చే నివేదికలను వ్యయాల కిందకు జమ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఎక్కడగానీ ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షించాలన్నారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ప్రజలు సి–విజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చని, ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత టీమ్ అక్కడికి వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారంలో లౌడు స్పీకర్ల మోత ఎక్కువగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, లౌడు స్పీకర్లతో ఎక్కువ సౌండ్ కలిగించే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 17 వరకు జరిగిన ఖర్చులను సంబంధిత పార్టీల ఖాతాలకు జమ చేయాలని, 18 నుంచి అభ్యర్థి, వారి పార్టీకి జమ చేయాలన్నారు. ఈ నెల 16 నుంచి అన్ని టీమ్స్ రిపోర్టులను అప్ డేట్ చేయాలన్నారు. సమావేశంలో గుడిపాల, చిత్తూరు తహసీల్దార్లు విజయలక్ష్మి ,శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓలు రాజశేఖర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వివిధ టీమ్స్ నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.